www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023
5
వైఎస్ఆర్

నేటి నుంచి పొలతలలో ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- పెండ్లిమర్రి

రాయలసీమ జిల్లాల్లో ఎంతో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన పొలతల క్షేత్రంలో శుక్రవారం నుంచి శివరాత్రి పండగ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా నలుమూలల నుంచేగాక మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. ఆలయంలో 17న స్వామి వారికి అలంకరణ, పూజా కార్యక్రమాలు, 18న ఉదయం కల్యాణోత్సవం ఉంటుందని కార్యనిర్వాహణాధికారి మహేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంబటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం రాయచోటి, కడప, పులివెందుల, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కొండపైకి దారి మలుపుల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.

నోటిఫికేషన్ షురూ!

- 23వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు
- 24న పరిశీలన, 27న ఉపసంహరణ మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- 'స్థానిక' ఎమ్మెల్సీ ఏకగ్రీవమేనా?

జిల్లాలో శాసనమండలి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఫిబ్రవరి 16వ తేదీ వరకు మార్చి 16న కౌంటింగ్, మార్చి 21వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. 2023 మార్చిలో రాష్ట్రంలోని ఐదుగురు ఎంఎల్‌సీల పదవీ కాలం ముగియనున్న సంగతి తెలిసిందే. పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల శాసనమండలి స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. జిల్లా అధికార యంత్రాంగం ఓటర్ల జాబితా సవరణ మొదలుకుని ఎన్నికల నిర్వహణ వరకు సర్వం సిద్ధం చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల పదవి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికలు రావడం ఆసక్తికరంగా మారిందని చెప్పవచ్చనే చర్చ ఆసక్తికలిగిస్తోంది.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కడప-కర్నూలు-అనంతపురం పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ సహా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కౌంట్‌డౌన్ మొదలైంది. గురువారం జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 24న పరిశీలన, 27న ఉప సంహరణ, మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్ షెడ్యూల్‌ను అమలు చేయాల్సి ఉంది. ఈ నెల 16 నుంచి 23 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఛాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సాగనుంది. మార్చి 18న మహా శివరాత్రి, 19న ఆదివారం మినహా మిగిలిన రోజులన్నీ ఎన్నికల ప్రక్రియ యథాతథంగా సాగనుంది. 24న నామినేషన్ల పరిశీలన, 27న ఉపసంహరణ ప్రక్రియ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు చేపట్టే అవకాశం ఉంది. అనంతరం మార్చి 13న ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్, 16న కౌంటింగ్, 21 తేదీతో ఎన్నికల ఘట్టం ముగి యనుంది.

భారీగా ఓటర్ల జాబితా

ఉమ్మడి కడప జిల్లాకు చెందిన 911 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఓటింగ్‌లో పాల్గొనున్నట్లు తెలుస్తోంది. వీరిలో జడ్‌పిటిసిలు 50 మంది, ఎంపిటిసిలు 547, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు 314 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఉమ్మడి కడప- కర్నూలు- అనంతపురం జిల్లాలకు చెందిన 27,716 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. కడపలో 7,358, అన్నమయ్య 1,932, అనంతపురం 5,461, సత్యసాయి జిల్లా 3,199, కర్నూలు 5,364, నంద్యాల 4,402 మంది ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3,51,700 మంది ఓటర్లు పాల్గొనే అవకాశం ఉంది. కడప జిల్లాలో 82,300, అన్నమయ్యలో 21,00, కర్నూలులో 62,500, నంద్యాలలో 65,500, అనంతపురంలో 69 వేలు, సత్యసాయిలో 51,400 మంది ఓటర్లు పాల్గొనే అవకాశం ఉంది.

ఎన్నికల బరిలో ప్రముఖులు

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎంఎల్‌సి స్థానానికి పిడిఎఫ్ తరుపున పోతుల నాగరాజు, వైసిపి తరుపున వెన్నపూస రవీంద్రారెడ్డి, టిడిపి తరుపున రామ్‌గోపాల్‌రెడ్డి బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పిడిఎఫ్ తరపున కత్తి నరసింహారెడ్డి, వైసిపి తరుపున రామచంద్రారెడ్డి ప్రధాన అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారాలను సాగిస్తుండడం తెలిసిందే. పిడిఎఫ్ తరపున పోటీ పడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థులకు యుటిఎఫ్ ఇతర ఉపాధ్యాయ, యువజన సంఘాల మద్దతు లభించడం ఉత్సాహాన్నిస్తోంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపికి చెందిన ఓటర్లు అత్యధికంగా ఉన్న నేపథ్యంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయనే విశ్లేషణలు ఉన్న సంగతి తెలిసిందే. ఏదేమైనా 2024 సార్వత్రిక ఎన్నికలు ముంగిట ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రీ ఫైనల్‌గా భావించే అవకాశాలు ఉన్నాయి నడంలో సందేహం లేదు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి : జెసి

కడప : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బరిలో ఉన్న ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, ప్రచార కార్యకర్తలు తప్పక ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెసి సి.ఎం. సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. గురువారం ఉదయం కడప స్థానిక సంస్థల నియోజకవర్గపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా, ఆరోగ్యకర వాతావరణంలో సాగేందుకు నిబంధనలు సూచనలను ఆయన తెలియజేశారు. ప్రతి మండలంలో ఎంసిసి టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించామన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నిర్వహణ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

ఎస్ఐ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు : ఎస్పి

ప్రజాశక్తి కడప అర్బన్

నగరంలో ఈ నెల 19న నిర్వహించబోయే ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎస్పి అన్బురాజన్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలోని 'సెంట్రల్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకూ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ నగరంలోని 11 పరీక్ష కేంద్రాలలో మొత్తం 9540 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. 11 కేంద్రాలను నాలుగు రూట్లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద తప్పక సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా హాజరు కావాలని పేర్కొన్నారు. మొబైల్స్, ఇతర డిజిటల్ పరికరాలను అనుమతించమని చెప్పారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సెంటర్‌లో పోలీస్ సిబ్బందితో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడి, వైయస్ఆర్ ప్రొఫెసర్, రీజియన్ కో ఆర్డినేటర్ డాక్టర్ రఘునాథ్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ బి. రాజా ప్రభాకర్, ఆర్‌ఐ సోమశేఖర్ నాయక్, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు, ఇన్విజిలేటర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పి అన్బురాజన్

ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ బదిలీ

తిరుపతి ఎస్ఇకి ఎఫ్ఎసి బాధ్యతలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రావన్ కుమార్‌రెడ్డి బదిలీపై వెళ్లారు. తిరుపతి నీటిపారుదల శాఖ ఎస్ఇగా విధులు నిర్వహిస్తున్న కె.హరినారాయణరెడ్డికి ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారు. ఆయన రెండ్రోజుల కిందట బాధ్యతలు చేపట్టారు. బదిలీకి గురైన చీఫ్ ఇంజనీర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఇటీవల జిల్లా నీటి పారుదలశాఖ ఇంజనీర్లతో కలిసి నిర్వహించిన అంతర్గత వేశంలో నిబంధనలు పాటించాలని కోరుతూ సహచర ఎస్ఇలకు హెచ్చరికలు చేయడం, అన్నమయ్య జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనుల్ని సకాలంలో పట్టాలు ఎక్కించడంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం కారణమైనట్లు తెలుస్తోంది. జిల్లా నీటిపారుదల శాఖ చేపట్టిన ప్రాజెక్టుల పనుల్లో ఇంజినీరింగ్ నిబంధనలు గట్టిగా పాటించాలని కోరడం, పైళ్లను కదలించకపోవడం, తరుచుగా సహచర ఇంజినీర్లకు మెమోలు, వివరణలు కోరడం, రిమార్క్స్ రాయడం వంటి చర్యలు తీసుకున్నట్లు సమాచారం. దీంతో సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో వేగం మందగించినట్లు తెలుస్తోంది. ఇటువంటి కారణాల నేపథ్యంలో ఎన్నికలకోడ్ ఉన్నప్పటికీ కమిషన్ నుంచి అనుమతి తీసుకుని అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్ కింద బదిలీ చేసినట్లు సమాచారం. ఆయన్ను తొలుత ఈస్ట్‌కోస్ట్ జిల్లాలకు బదిలీ చేయాలనుకున్నట్లు తెలిసింది. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో జిల్లాలోని క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చీఫ్ ఇంజినీర్‌గా బదిలీ చేసినట్లు సమాచారం. ఏదేమైనా రెగ్యులర్ సిఇని బదిలీ చేసి తిరుపతి జిల్లా ఎస్ఇకి ఎఫ్ఎసి ఇవ్వడం చర్చనీయాంశంగా మారిందని చెప్పవచ్చు.

చట్టాలపై అవగాహన అవసరం : జడ్జి

కడప : లీగల్ లిటరసీ క్లబ్‌లో ఉండే పుస్తకాలను బాగా చదివి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత సూచించారు. గురువారం ఎర్రముక్కపల్లి గాంధీనగర్ హైస్కూల్‌లోని లీగల్ లిటరసీ క్లబ్‌ను ఆమె సందర్శించారు. అక్కడ పిల్లలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. కార్యక్రమంలో గాంధీనగర్ హై స్కూల్ హెడ్మాస్టర్ సత్య సుజాతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నిసార్లు పునాది రాళ్లు వేస్తారు? : టిడిపి

కడప అర్బన్ : ఉద్యోగ అవకాశాలు వస్తాయన్న ఆశతో ఎదురుచూస్తున్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఎన్నిసార్లు పునాది రాళ్లు వేస్తారని, ఎన్నిసార్లు భూమి పూజ చేస్తారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2018, నవంబర్‌లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు భూమి పూజ చేశారని గుర్తు చేశారు. అదే పునాదిరాయిని కొనసాగించి పరిశ్రమ నిర్మాణాన్ని కొనసాగించి ఉంటే అంతో ఇంతో పనులు జరిగే వన్నారు. జమ్మలమడుగు సున్నపురాళ్లపల్లెలో 2019, డిసెంబర్‌లో వై.ఎస్. జగన్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పునాది రాయి వేశారని, భూమి పూజ చేశారన్నారు. నాలుగు సంవత్సరాలకు తిరిగి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు జగన్ భూమి పూజ చేయడం జిల్లా వాసులకు ఆశలు కల్పించినట్లు ఉందని పేర్కొన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వ వాటా ఎంత, ప్రయివేట్ వాటా ఎంత, నిధులు ఎక్కడి నుంచి తెస్తారన్నదానిపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధాల ముఖ్యమంత్రిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. తెలుగుదేశం అధికారంలోనికి రానున్నదని, ఉక్కు పరిశ్రమ పూర్తవుతుందని చెప్పారు.

ఓర్వలేకనే తిట్ల పురాణం

- రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

కడప : వైసిపి నాలుగేళ్లల్లో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక, చంద్రబాబునాయుడు, లోకేష్ ప్రభుత్వంపైనా, సిఎం జగన్‌పైనా వ్యక్తి దూషణలకు, తిట్ల పురాణానికి తెరలేపారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు వారు చేసిన మంచి పనులు చెప్పుకునేందుకు ఏమీ లేకనే సిఎంను విమర్శిస్తున్నారని వాపోయారు. లోకేష్ పాదయాత్రలో జనం లేరనే అసహనంతో ప్రభుత్వంపైనా, వై.ఎస్. జగన్‌పైనా అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల్లో సిర్థస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. లోకేష్‌కు తెలుగులో ప్రావీణ్యం లేక పచ్చిబూతులు మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైసిపి నాయకులు కొండయ్య పాల్గొన్నారు.

నేడు నగరంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- కడప అర్బన్

జన వికాస్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్. ఎండీ. తాహిర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ మన్సూర్ అలీఖాన్ ,రాష్ట్ర సలహాదారులు నూనె నాగేష్, పీవీ రమణ,డాక్టర్ శ్రీనివాసులు, కార్యదర్శి యునుస్ బాషా తెలిపారు. గురువారం మారుతీ నగర్‌లో ఉన్న సమితి కార్యాలయం లో నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన వికాస్ రాష్ట్ర అధ్యక్షులు జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని వృద్ధ ఆశ్రమాలలో,అనాథ పిల్లల వసతి గృహాలలో అల్పాహారం, పండ్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. బృహదా బ్లడ్ బ్యాంక్ లో ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో జన వికాస్ ప్రతినిధులు తాజుద్దీన్, డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ నాసిర్ అలీ,అబ్దుల్ వాజిద్, వాలేపు శివ, స్ఫూర్తి ఎ హెూప్ ఫౌండర్ వెంకటేష్,షేర్ హెల్ప్ టీమ్ ఫౌండర్ అలిషేర్,ఖాన్ కా రిష్తా అధ్యక్షుడు తారిఖ్ అలీ,లక్ష్మీ నరసింహ పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

కడప అర్బన్: సుస్థిర అభివృద్ధి సాధించడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని, ఇందులో యువత పాత్ర కీలకమని ఢిల్లీకి చెందిన 'ప్రవా' స్వచ్ఛంద సంస్థ రిసోర్స్ పర్సన్ ఇషాని సేన్ పేర్కొన్నారు. గురువారం యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వైవీయూలోని సెమినార్ హాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో ఆమె దేశ ప్రగతిలో ఎన్ఎస్ఎస్ పాత్ర గురించి వివరించారు. శిక్షణలో భాగంగా 17 నిర్దేశిత సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ఎంపిక చేసుకుని వాటిని సాధించినప్పుడే దేశ ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు.

నగరంలో ఉద్రిక్తత

- బహిరంగ చర్చను అడ్డుకున్న పోలీసులు
- వైసిపి నాయకులు అరెస్టు, స్టేషన్‌కు తరలింపు
- టిడిపి నాయకుల హౌస్ అరెస్టు

ఆందోళన చేస్తున్న వైసిపి మహిళా నాయకులు

ప్రజాశక్తి - కడప

కడప నియోజకవర్గ అభివృద్ధిపై వైసీపీ, టిడిపిల మధ్య సవాళ్లు ప్రతి సవాళ్లు చోటు చేసుకున్నాయి. కడప నడిబొడ్డున చర్చకు సిద్ధమంటూ రెండు రోజులుగా ఇరు వర్గాల నాయకులు సవాళ్లు విసురుకున్నారు. అందులో భాగంగా గురువారం చర్చకు సిద్ధమంటూ కడప ఏడు రోడ్ల కూడలి వద్దకు చేరుకున్నారు. ముందుగా వైసిపి నాయకులు రావడంతో కడప డిఎస్‌పి వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. దీంతో కొంత సేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జిల్లాలో 30 పోలీస్ యాక్టు, ఎన్నికల్ కోడ్ అమలులో ఉండడంతో బహిరంగ చర్చలు నిర్వహించరాదని పోలీసులు నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో కాసేపు వైసీపీ నేతలకు, పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. నాయకులను పోలీసులు అరెస్టు చేసి వ్యాన్‌లో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. అదే పార్టీకి చెందిన మహిళా నాయకులు ఏడు రోడ్ల కూడలి సెంటర్లో రోడ్డుపై బైఠాయించి టిడిపికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తర్వాత అక్కడికి డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డితోపాటు కార్పొరే టర్లు ఏడు రోడ్ల కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుండి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మరోపక్క వైపు టిడిపి నాయకులను బహిరంగ చర్చకు రాకుండా ఎక్కడి కక్కడ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్రకార్యదర్శి హరిప్రసాద్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. వారి ఇళ్ల వద్ద పోలీసులు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సవాల్ విసిరిన వైసిపి నాయ కులను రోడ్లపైకి వదిలి తమను అరెస్టు చేయడం తగదని శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. మరో వైపు డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

హౌస్ అరెస్టులు దుర్మార్గం

కడప అర్బన్ : అభివృద్ధిపై చర్చకు సిద్ధమన్న వైసిపి నాయకులు పోలీసుల ద్వారా టిడిపి నాయకులను హౌస్ అరెస్టులు చేయించడం, పోలీస్ స్టేషన్లకు తరలించడం దుర్మార్గమని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీని వాసరెడ్డి అన్నారు. గురువారం పోలీసుల తీరుకు నిరసనగా తన ఇంటి ఎదురుగా నిరసన చేపట్టారు. ఆయనకు అండగా టిడిపి నాయకులు, కార్యకర్తలు నిలిచారు.

ఎమ్మెల్యే చాలా విషయాలు మరిచారు : టిడిపి

కడప అర్బన్ : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సిబిఐ విచారణ చేయాలని కోరడంలో అనేక విషయాలు మరచిపోయారని టిడిపి ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.వి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నందం సుబ్బయ్య హత్య కేసులో తమ ప్రమేయం లేదని విచారణ చేయమని సిబిఐని ఎమ్మెల్యే ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. గతంలో పార్టీ తరపున, నందం సుబ్బయ్య సతీమణి అప రాజిత కూడా సిబిఐతో విచారించాలని కోరారని గుర్తు చేశారు. హైకోర్టులోనూ రిట్ వేశారని చెప్పారు. అందులో ఎమ్మెల్యే, ఆయన బామర్ది ప్రతివాదులని తెలిపారు. ప్రభుత్వం తరపున సిబిఐకి లేఖ పంపి నిజాయితీని నిరూపించుకోవాలని హితవు పలికారు.

తాత్కాలికంగా పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి-కడప

కార్యాచరణ కారణాలవల్ల కొన్ని రైళ్లను దక్షిణ మధ్య రైల్వే శాఖ తాత్కాలికంగా రద్దు చేసినట్లు కడప రైల్వే స్టేషన్ మేనేజర్ డి.ఎన్ రెడ్డి తెలిపారు. రద్దుచేసిన రైళ్ల వివరాలు ఆయన వెల్లడించారు. ఈనెల 16, 17 తేదీలలో మహబూబ్ నగర్ –కాచిగూడ, కాచిగూడ– కర్నూల్ సిటీ, చిట్టాపూర్– సికింద్రాబాద్, కాచిగూడ– మహబూబ్‌నగర్, సికింద్రాబాద్– వరంగల్, వరంగల్– హైదరాబాద్, కాజీపేట– వరంగల్, డోర్నకల్– విజయవాడ, డోర్నకల్ –కాజీపేట, విజయవాడ –భద్రాచలం ఆర్డి, కాచిగూడ– బోధన్, బోధన్– మహబూబ్‌నగర్, గుంతకల్– రాయచూర్ రైళ్లను రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చేనేతలకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - కడప

మార్చి 13 న నిర్వహించే 9 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేనేత వర్గానికి చెందిన ఇద్దరికి అవకాశం కల్పించాలని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర కమిటీ అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు గురువారం మీడియా ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేతలకు, బీసీలకు ముఖ్యమంత్రి ప్రోత్సాహం అందిస్తున్నారని, ఇందులో భాగంగానే చేనేత వర్గానికి చెందిన ఒక మహిళకు, ఒక పురుషునికి ఎమ్మెల్సీ పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీకి ఎల్లవేళలా అండగా ఉన్న కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుండి, ఉమ్మడి నాలుగు జిల్లాల నుండి కనీసం రెండు ఎమ్మెల్సీ స్థానాలను చేనేత వర్గానికి కేటాయించాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కంచుపాటి డిమాండ్ చేశారు. గురు వారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్, ప్రభుత్వం మునిసిపల్ కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. మహిళలకు నాలుగు పూటల మస్టర్ వేయడం సరి కాదని తెలిపారు. ఈ విధానం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారిలో నెలసరి సమస్యలు, ఆపరేషన్ అయినా వారు, వయస్సు దాటినా వారు ఉన్నారని చెప్పారు. ఇప్పుడు కొత్తగా ఫేస్ మస్టర్ విధానం అమలుకు అధికారులు సర్క్యు విడుదల చేశారని చెప్పారు. పారిశుధ్య కార్మికులు ఎక్కువ మంది చదువు రాని వారు, కనీసం కీ ప్యాడ్ ఫోన్లు వాడడం రాని వారు ఉన్నారని, ఫేస్ మస్టర్ విధానం ప్రభుత్వం వెంటనే స్పందించి వెనుకకు తీసుకోవాలని పేర్కొన్నారు. కోవిడ్19 సిబ్బందికి ఇఎస్ఐ, పిఎఫ్ ఖాతాలోడబ్బులు జమచేయాలని, బ్యాంకు ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. క్రమబద్ధీకరణ కార్మికుల హక్కు అన్నారు. పని భారం పెంచుతూ బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరం అయితే రిలే నిరాహారదీక్షలకు సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి, నగర సహాయ కార్యదర్శి, డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్, అధ్యక్షులు వడ్లపల్లి బాబు, గోపి, కార్మికులు పాల్గొన్నారు.

'లిప్'ను తప్పనిసరిగా అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి పాఠశాలలో లర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం (లిప్) తప్పనిసరిగా అమలు చేయాలని అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల డీఈవోలు రాఘవ రెడ్డి, దేవరాజు పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ పొందిన మండల విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్, ప్రభుత్వ, నగరపాలక, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ యాజమాన్యాలలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులకు తప్పనిసరిగా లిప్‌ను ప్రతి పాఠశాలలో అమలు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. బుక్కపట్నం డైట్ ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడుతూ లిప్‌ను అమలు చేయడం వల్ల విద్యార్థులలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలపై చదవడం, రాయడం సరళంగా నేర్చుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ సభ్యులు లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడప డిప్యూటీ డిఇఒ రాజగోపాల్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, కడప ఎంఇఒ పాలెం నారాయణ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

'వన్‌స్టాప్' సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కడప సిటీ

మాట్లాడుతున్న వన్‌స్టాప్ కౌన్సిలర్ సునీత

బాల్య వివాహాలు, లైంగిక, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, గృహ హింస, అపహరణ, వెట్టిచాకిరీ వంటి నేరాలకు బాలికలు, మహిళలకు గురైనప్పుడు వన్‌స్టాప్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ సునీత పేర్కొన్నారు. గురువారం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు నిర్భయ, దిశాచట్టాలు, సఖిసెంటర్, సుకన్య సమృద్ధి యోజన, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికలు సమాజంలో జరిగే వాటి గురించి తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. లాయర్ జి. ఉమాదేవి మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళా హెల్ప్‌లైన 181, పోలీస్ హెల్ప్‌లైన్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 112 నంబర్లల్లో సంప్రది ంచాలన్నారు. దిశా యాప్‌ను మహిళలు తమ భద్రత కోసం వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మజ, ప్రిన్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణలో సిపిఎం నాయకులు

ప్రజా ఉద్యమాలను బలపరచండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - బద్వేలు

ప్రజా ఉద్యమాలను బలపరిచి, ఉద్యమ అభివృద్ధికి విరాళాలు ఇవ్వాలని ప్రజలను సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ కోరారు. గురువారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాఉద్యమ అభివృద్ధికి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కోసం నిర్వహించే ప్రజా ఉద్యమాలను బలపరచాలని అన్నారు. సిపిఎం రైతు , కార్మిక , వ్యవసాయ కార్మిక , మహిళ , దళిత , బలహీన వర్గాల , యువత , విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు ప్రతి మూడేళ్లకు ఒకసారి సిపిఎం శాఖ నుంచి అఖిలభారతస్థాయి వరకు మహాసభలు నిర్వహించుకుని ప్రజా సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి కార్యక్రమాలు రూపొందిస్తామని చెప్పారు. సిపిఎం విశిష్టత కడప జిల్లాలో అనేక రూపాల్లో కార్యక్రమాలు చేపట్టి ప్రజల వేన్నంటే నిలిచింది, కరోనా సమయంలో మానవతావాదులు ఇచ్చిన సహకారంతో అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు వామపక్ష , ప్రజాతంత్ర , లౌకిక శక్తులను కలుపుకుంటూ కమ్యూనిస్టు ఉన్నత విలువలతో కూడిన రాజకీయాలను చేపడుతుందన్నారు. సిపిఎం చేసే ఉద్యమాలను బలపరచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చాంద్ బాషా, పట్టణ కమిటీ సభ్యులు మస్తాన్, రమణయ్య, మోక్షమ్మ , సిపిఎం నాయకులు సుబ్బరాయుడు, బాబయ్య, సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేయించుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

క్యాంపెయిన్ ప్రారంభిస్తున్న దుర్గాప్రసాద్

వాహనాలను ఎప్పటి కప్పుడూ షో రూమ్‌లో తనిఖీ చేయిం చుకోవాలని దుర్గా సంస్థల అధినేత దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం షో రూమ్‌లో క్యాంపెయిన్ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని మరియాపురం రోడ్ లో ఉన్న మహేంద్ర షోరూంలో మహేంద్ర ఎం ప్లస్ క్యాంపెయిన్ వాహనదారుల సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కంపెనీ ఎజిఎం రాఘవేంద్ర మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 26 వరకు ఈ క్యాంపెయిన్ కొనసాగుతుందని తెలిపారు. వాహనదారులకు స్పేర్ పార్ట్స్, లూబ్రికేంట్స్, లేబర్ ఛార్జీలో డిస్కౌంట్ ఉంటుందని చెప్పారు. మాక్స్ కేర్‌పై 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహేంద్ర వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్లు చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు పండ్ర రంజిత్ కుమార్, సిబ్బంది, మెకానిక్స్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఉపాధి కోర్సులు

కడప : ఆర్ట్స్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన ఉద్యోగ, ఉపాధికి సంబంధించిన కోర్సులున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. గురువారం కళాశాలలో అడ్మిషన్ల కోసం ఖాజీపేట ప్రభుత్వ మోడల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రచారం నిర్వహంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ కలల సహకారానికి ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) ఎంపిక చేసుకోవడం ఉత్తమమైందని తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు, ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య, రసాయన శాస్త్ర అధ్యాపకులు అయ్యవారురెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిబిసి ఎస్‌డిసి రమేష్‌రెడ్డి

రైతులు సహకరించాలి : ఎస్‌డిసి

ప్రజాశక్తి - లింగాల

మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వేంపల్లి మండలంలోని గిడ్డంగివారి పల్లి గ్రామానికి సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేయనున్న పైప్‌లైన్ పనులకు రైతులు సహకరించాలని పిబిసి ఎస్‌డిసి రమేష్‌రెడ్డి కోరారు. కోమనూతల, ఎగువపల్లి, దిగువపల్లి, మురారి చింతల, చలోపల్లి తదితర గ్రామాల రైతులతో గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఎస్‌డిసి మాట్లాడుతూ పైప్‌లైన్ వెళుతున్న రైతుల పొలాలకు ఎకరాకు రూ.6.50 లక్షలు ప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందని తెలిపారు. ఈ పైపులు ఏర్పాటుకు అడ్డంకులు సృష్టించకుండా ఉండాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, ఆయా గ్రామాల విఆర్‌ఓలు పాల్గొన్నారు.

మూడు ముక్కలాట ఆలోచనను సిఎం మానుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాజధానిని అమరావతి నుండి విశాఖకు తరలించే నిర్ణమైన మూడు ముక్కలాట ఆలోచనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇకనైనా మానుకోవాలని పిసిసి మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి సూచించారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని అమరావతిని మార్చే ఆలోచన రాష్ట్రానికి, వైసిపికి మంచిది కాదన్నారు. పండంటి కాపురానికి పన్నెండు సూత్రాలు అన్నట్లు రాజధానిగా అమరావతిని కొనసాగించేందుకు పన్నెండు అనుకూల అంశాలు ఉన్నట్లు చెప్పారు. కొత్తది కోరడం లేదు.. ఉన్న దాన్నే కొనసాగించడమన్నారు. 2014లో అమరావతినే రాజధానిగా అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా జగన్ అసెంబ్లీ సాక్షిగా ఆహ్వానించాడని పేర్కొన్నారు. తమ నాయకుడు ఇక్కడే ఇల్లు కొన్నాడు.. రాజధానిగా అమరావతి కొనసా గుతుందని 2019 ఎన్నికల సందర్భంగా వైసిపి నాయకులు దండోరా వేశారని గుర్తు చేశారు. 2015లో భారత ప్రధానమంత్రి అమరావతిలో శంకుస్థాపన చేశారని తెలిపారు. భారత దేశ పటంలో ఎపి రాజధానిగా అమరావతిని గుర్తించారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రాన్ని సర్వనాశనం చేయవద్దని తులసిరెడ్డి సిఎంకు సూచించారు.

నామమాత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించేందుకు మూడు నెలలకొసారి నిర్వహించే మండల సమావేశం గురువారం నామ మాత్రంగా ముగించేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో ఎంపిపి-1 రేణుక, ఉప మండల అధ్యక్షులు పుష్పలత ఆధ్వర్యంలో ఎంపిడిఒ రమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయా శాఖల్లో జరిగే అభివృద్ధిపై అధికారులు వివరించారు. పది మంది ఎంపిటిసిలకుగానూ నలుగురు ఎంపిటిసిలు మాత్రమే హాజరయ్యారు. 19 మంది సర్పంచులకు గానూ చింతకుంట సర్పంచు రామ చంద్రారెడ్డి, కొత్త పల్లె సర్పంచు అరుణమ్మ, మంగపట్నం సర్పంచు లక్ష్మిప్రసన్న మాత్రమే పాల్గొ న్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సిడిపిఒ ముంతాజ్‌బేగం, హౌసింగ్ ఎఇ రవికుమార్, ఎఒ వెంకటకృష్ణారెడ్డి, సిహెచ్‌ఒ మహదేవ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఖాదర్‌వలి

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రూరల్ మండల పరిధిలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా అదనపు డిఎంహెచ్‌ఒ ఖాదర్‌వలి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం లోని పలు రికార్డులను, రిపోర్టులను పరిశీలిం చారు. అనంతరం ఆయన వైద్యాధికారి హనీఫ్ బాబాతో మాట్లాడుతూ గర్భిణుల, పిల్లల నమోదు వందశాతం ఉండా లన్నారు. నమోదు చేసిన ఆ వివరాలను, సేవలను 100శాతం ఆర్‌సిహెచ్‌లో నమోదు చేయాలని సూచించారు. అన్ని జాతీయ కార్యక్రమాలపై చర్చించారు. క్షయ నిర్మూలన కోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం సాధించిన ప్రగతి పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శంకర్, స్టాఫ్ నర్స్ విజయమ్మ, సుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పెట్రోల్ బంకు నిర్వాహకులు నియమాలు పాటించాలని డిఎస్‌ఒ సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక కచేరి రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకును గురువారం ఆయన తనిఖీ చేశారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంకులను తనిఖీ చేసినట్లు డిఎస్‌ఒ తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌కు సంబంధించి ప్రత్యేక యాప్ వచ్చిందన్నారు. ఇందులో వారి వివరాలు పూర్తిగా నింపాలన్నారు. బాత్రూం, గాలి మిషన్లు, జనరేటర్లు, స్టాక్‌రేట్లు, కొలతలకు సంబంధించి నియమాలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించామన్నారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సుజిత్, అభిషేక్, విఆర్‌ఒ సాయి ఉన్నారు.

అయ్యప్ప ఆలయానికి భూమిపూజ

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్ప నూతన ఆలయ నిర్మాణానికి గురువారం ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు మేడా రఘునాథరెడ్డి భూమి పూజ నిర్వహించారు. కేరళ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన స్తపతి, శిల్పులు, నెల్లూరు నుంచి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మేడా భాస్కర్ రెడ్డి, మేడా మధుసూదన్ రెడ్డి, మేడా వెంకట శేషారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైసిపి నాయకులు ఎస్‌బి అహ్మద్‌బాష, పోతుల వెంకట్రామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, డీఎస్ఆర్ శంకరయ్య, రాణాప్రతాప్, కరుణాకరా రెడ్డి, వెంగల్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్కూల్ వ్యాన్ ఢీకొని బాలిక మృతి

ప్రజాశక్తి - పెండ్లిమర్రి

మృతి చెందిన చిన్నారి జాహ్నవి

మండల పరిధిలోని మిట్టమీదిపల్లె మొయిల్ల కాల్వ రహదారిలో గురువారం ఉదయం స్కూల్ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో చిన్నారి జాహ్నవి అక్కడికక్కడే మృతి చెందింది. దుర్ఘటనతో బాలిక తల్లిదండ్రులు సొమ్మ సిల్లి పడిపోయారు. వెల్లటూరులోని సత్యసాయి హైస్కూల్‌కు చెందిన వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ డ్రైవర్ పరారు కాగా, స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి సిబ్బందితో సంఘటనాస్థలానికి వెళ్లి స్కూల్ వ్యాన్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగర పంచాయతీ ఆదాయానికి గండి

- గేటు మొత్తం చెల్లింపులో నిర్లక్ష్యం.. బకాయి నగదు రూ.18.29 లక్షలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని దినసరి మార్కెట్ గేటు వసూళ్లకు సంబంధించి గతేడాదిలో జరిగిన వేలం పాటలో బాల ఆంజనేయరెడ్డి అనే వ్యక్తి కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. సదరు కాంట్రాక్టర్ రూ.15,50,100తో పాట దక్కించుకున్నారు. ఈ మొత్తానికి జిఎస్‌టి రూ.2,79,018 కలుపుకొని మొత్తం రూ.18,29,118 నగర పంచాయతీకి వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంది. వేలం దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ డిపాజిట్ రూపంలో ఐదు లక్షలు, రెండు నెలలకు సంబంధించిన వాయిదాలు మొత్తం రూ.2,64,000 చెల్లించారు. మొత్తంగా రూ.7 లక్షల 64వేలు మాత్రమే నగర పంచాయతీ ఖజానాకు చేరింది. మిగిలిన మొత్తానికి సంబంధించి తొమ్మిది నెలలు గడిచినా ఇంతవరకు నగర పంచాయతీ ఖజానాకు జమ చేయలేదు. ఈ మొత్తాన్ని సదరు కాంట్రాక్టర్ నగర పంచాయతీ ఖజానాకు జమ చేయకపోవడం వల్ల ఆదాయానికి గండి పడిందని పలువురు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు డబ్బులు కట్టాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినా సదరు కాంట్రాక్టర్ సమాధానం చెప్పకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సదరు కాంట్రాక్టర్ స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు కావడంతో అధికారులు ఒత్తిడి చేయలేకున్నారనే ఆరోపణలున్నాయి. సదరు కాంట్రాక్టర్ ఇచ్చిన ధరలకంటే చట్టవిరుద్ధంగా అదనపు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో భారీ వాహనాలకు సంబంధించి లోడు, అన్‌లోడ్ వసూళ్లు రూ.80 ఉండగా సదరు కాంట్రాక్టర్ రూ.200 నుండి రూ.300 వసూలు చేస్తున్నారని సమాచారం. అలాగే ఆటోల వద్ద కూడా ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆటో యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదనపు వసూళ్లకు సంబంధించి సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశామని అధికారులు చెబుతున్నా.. ఎమ్మెల్యే అండదండలు ఉండడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదనే చర్చలు ప్రజల్లో బలంగా వినపడుతున్నాయి. సదరు కాంట్రాక్టర్ తన సిబ్బందితో ప్రతిరోజు గేటు మొత్తాలను వసూలు చేసుకోవడం జరుగుతున్నప్పటికీ, ప్రతినెల మున్సిపాలిటీకి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించకపోవడం గమనార్హం. మార్చి నెలలో 2023-24 సంవత్సరానికి సంబంధించిన వేలంపాట నిర్వహణకు మున్సిపల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కానీ ప్రస్తుత కాంట్రాక్టర్ నుండి మాత్రం డబ్బులు వసూలు చేయడంలో అధికారుల విఫలమయ్యారని విమర్శలున్నాయి. ఇప్పటికైనా దీనిపై అధికారులు శ్రద్ధ చూపి నగర పంచాయతీకి రావలసిన మొత్తాన్ని చెల్లించేలా గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో గురువారం ఎంపిపి టి.లక్షుమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నాడు-నేడులో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. ఎక్కడైనా పెండింగ్‌లో ఉన్న భవనాలను కూడా బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బైజుస్ ద్వారా విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి ఎంఎల్‌హెచ్‌పిలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రభుత్వ వైద్యాన్ని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ప్రస్తుతం రబీలో 3200 ఎకరాలు పంటలు సాగయ్యాయని తెలిపారు. వీటిని రైతులు అందరూ ఇక్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అవసరమైన రైతులు డ్రోన్ పిచికారి యంత్రాలను సబ్సిడీతో పొందాలన్నారు. ఉపాధి హామీ ద్వారా రైతులకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి చేయించాలన్నారు. వివి కొట్టాలు గ్రామంలో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడంలో ఆలస్యమవుతోందని సర్పంచు నారాయణరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. సిద్దారెడ్డిపల్లెలో ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలని సర్పంచు సరోజమ్మ కోరారు. సమావేశంలో ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు, తహశీల్దార్ సుబానీ, జడ్‌పిటిసి జె.రాజి, వైస్ ఎంపిపి సుందరమ్మ, ఐసిడిఎస్ సిడిపిఒ అరుణకుమారి, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, ఎఒ మ్యాగీ, ఎంఇఒ రవిశంకర్, హౌసింగ్ మహబూబ్ బాషా, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్నమ్మ, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ఎమ్మెల్యేను సన్మానించిన ఐసిడిఎస్ సిబ్బంది

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిని ఐసిడిఎస్ సిడిపిఒ అరుణకుమారి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఐసిడిఎస్ ప్రాజెక్టులు రీ ఆర్గనైజేషన్‌లో భాగంగా జమ్మలమడుగులో ఉన్న ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయాన్ని విభజించి చాపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. చాపాడు ప్రాజెక్టు కింద చాపాడు, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలాలను ఎంపిక చేశారు. దీంతో సమావేశాలకు ఇక జమ్మలమడుగు పోవాల్సిన అవసరంలేదు. ప్రాజెక్ట్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేను ఐసిడిఎస్ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, జడ్‌పిటిసి జె.రాజీ, ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రాజ్యలక్ష్మి, సుబరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు అరుణ, ఝాన్సీ భారతి, మహాలక్ష్మి, శ్రీదేవి,కార్యకర్తలు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే గిరిజనుల అభివృద్ధి'

మాట్లాడుతున్న ఎస్‌టి సెల్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అన్ని వర్గాల ప్రజలతోపాటు గిరిజనులు అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ అధ్యక్షుడు, కార్యనిర్వాహక కార్యదర్శి దొన్నుదొర నాయక్, మలదారు నాయక్ పేర్కొన్నారు. చైతన్య సదస్సులో భాగంగా గురువారం టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు జమ్మలమడుగు నియోజవర్గానికి వారు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గిరి పుత్రిక పథకంలో రూ.50,000 ఇస్తామని చెప్పి మూడేళ్ల నుంచి పట్టించుకోకుండా పదవ తరగతి చదివి ఉండాలనే నిబంధన పెట్టడం ముఖ్యమంత్రి జగన్ మాట తప్పడం కాదా అని ప్రశ్నించారు. మీరే మోసపూరిత వాగ్దానాలతో ఒక్కసారి ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చారన్నారు. పాదయాత్రలో భాగంగా గిరిజన తండాలను అభివృద్ధి చేస్తానని చెప్పిన జగన్ మాట తప్పారన్నారు. ఏ ఒక్క గిరిజన తండాను మూడేళ్ల దాటిన కూడా పట్టించుకున్న పాపానపోలేదన్నారు. గిరిజనవాసి ఉప ముఖ్యమంత్రిగా ఉండి కూడా గిరిజనులను పట్టించుకోని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారన్నారు. గిరిజనులు అన్ని రకాలా అభివృద్ధి చెందాలంటే 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, రాష్ట్ర ఎస్‌టి సెల్ నాయ కులు బుక్కే విజయ్‌కుమార్ నాయక్, మనోహర్ నాయక్, రవికుమార్, హను మంతు నాయక్, జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనిచేయించడం సబబేనా? : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులకు విద్యాబుద్ధులు బోధించకుండా పనులు చేపించడం సబబేనా అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత మార్కెట్ పాఠశాలలో పిల్లలతో పని చేపించడాన్ని ఆయన తప్పు పట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ వేలకు వేలు ప్రభుత్వం జీతాలు ఇస్తూ పిల్లలకు చదువు చెప్పండని చెబితే.. వీరు మాత్రం పనులు చేపించడం మామూలైందన్నారు. ఉపాధ్యాయులను ఇదేంటి సార్ అని అడిగితే ఇంటి వద్ద పిల్లలతో పనులు చేపించుకోవడం లేదా అని అంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పిల్లలతో ఎట్టి పరిస్థితుల్లోనూ పని చేపించద్దని చెబుతున్నా, వీరు మాత్రం మారడం లేదన్నారు. గతంలో కూడా పిల్లతో స్కూల్ ఆవరణలో, బయట పిచ్చిమొక్కలు పీకిస్తూ పత్రికల్లో కథనాలు వచ్చాయన్నారు. అయినా మారడం లేదన్నారు. నీళ్ళు మోపిస్తాం, స్కూల్ బిల్డింగ్‌కు నీళ్ళు కొట్టిస్తాం, కంకర మోయిస్తాం అంటే కుదరదు కదా అన్నారు.

నీటి క్యాన్‌ను మోస్తున్న విద్యార్థులు

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం : తహశీల్దార్

ప్రజాశక్తి - చాపాడు

శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తహశీల్దార్ సుభాని తెలిపారు. ఆలయ ఇఒ శ్రీనివాసులు, చైర్మన్ జిటి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం అన్ని శాఖల అధి కారు లతో ఆలయంలో ఉత్స వాల ఏర్పాట్లను పర్యవే క్షించారు. ఈ సం దర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బారికేడ్లు, పారిశుధ్యం, ప్రథమ చికిత్స, విద్యుత్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామన్నారు. భక్తులు కూడా సిబ్బం దికి సహకరించాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేసేలా భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. ఎస్ఐ కెసి రాజు మాట్లాడుతూ పం డుగ రెండు రోజులపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని, దేవదాయ సిబ్బంది కూడా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎఇ వీరారెడ్డి, సిహెచ్‌ఒ రాముడు, వివేకానంద హైస్కూల్ కరెస్పాండెంట్ నాగే శ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

దేవగుడిలో కల్యాణ మహోత్సవం

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని దేవగుడి గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ అశ్వర్థ నారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ దివ్యజ్ఞానందగిరి స్వామిని ఆహ్వానించి భక్తులకు సందేశం ఇప్పించారు. అనంతరం ఆయనను నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, శివనా రాయణరెడ్డి సన్మానించారు. భక్తులకు, ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, దేవగుడి గ్రామప్రజలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రస్తుత పోటీ ప్రపంచడంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సార్థకత సాధ్యమని వైసిపి జిల్లా ప్రచార కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి పేర్కొ న్నారు. తన తల్లి సరోజమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం ఆమె జ్ఞాపకార్థం నాగేంద్రారెడ్డి మహి ళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 సంవత్సరాల నుంచి ప్రతి వర్ధంతి రోజున సరోజమ్మ జ్ఞాపకార్థం పేద వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. దాదాపు 250 మంది మహిళలకు చీరలు, గాజులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సరోజమ్మ భర్త రాజగోపాల్‌రెడ్డి, సర్పంచు శివలక్ష్మి, వైసిపి నాయకులు వాలంటీర్లు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న నాగేంద్రా రెడ్డి, కుటుంబ సభ్యులు

విభిన్నప్రతిభావంతుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - వేంపల్లె

విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఇఒ వీరారెడ్డి తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో గురువారం విద్యాభ్యాసం చేస్తున్న విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ట్రై సైకిల్, సిపి చైర్స్, వీల్‌చైర్‌లను ఎంఇఒ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేకంగా విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఇఆర్‌టి యశోద, రామాంజనేయరెడ్డి, సిఆర్‌పి ప్రకాష్‌రెడ్డి, నాగరాణి, సూర్యకుమారి, కళ్యాణి, సిజివి సుజాత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపకరణాలను పంపిణీ చేసిన ఎంఇఒ వీరారెడ్డి

ప్రత్యేక విద్యుత్ అదాలత్ వాయిదా

ప్రజాశక్తి - మైదుకూరు

శుక్రవారం నిర్వహించాల్సిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం వాయిదా పడినట్లు మైదుకూరు డివిజన్ విద్యుత్ ఇఇ జివి రామిరెడ్డి తెలిపారు. మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు బద్వేలు, గోపవరం, అట్లూరు, బ్రహ్మంగారిమఠం, పోరుమామిళ్ల, కలసపాడు, కాసినాయన, బి.కోడూరు మండలాల విద్యుత్ వినియోగ దారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. మళ్లీ ఎప్పడు నిర్వహించేది తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

జిల్లా స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కొండాపురం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటుకున్నారు. 2022-23 సంవత్సరానికిగానూ జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు ఈనెల 13,14తేదీల్లో పులివెందుల అహోబిలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.యశస్విని, జె.శిరీష 'ఏకో ఫ్రెండ్లీ' విభాగంలో ద్వితీయ స్థానాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానో పాధ్యాయులు కె.రామయ్య, సైన్స్ ఉపాధ్యాయులు నిర్మల, శివప్రసాద్‌రెడ్డి, అనసూయ, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

వక్ఫ్ ఆస్తులను రక్షిస్తాం : కాంగ్రెస్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురై అన్యాక్రాంతమవుతున్నాయని, వీటిపై సమగ్రంగా సర్వే నిర్వహించి రక్షించుకుంటామని గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన ప్రొద్దుటూరుకు చెందిన మహమ్మద్‌రఫి పేర్కొన్నారు. అనంతపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాదా గాంధీ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు, రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డికి, పిసిసి మాజీ అధ్యక్షుడు శైలజానాథ్‌కు, ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి నజీర్‌కు ధన్యవాదాలు తెలిపారు

నియామకపత్రం అందుకుంటున్న రఫీ

మానవత్వాన్ని చాటుకున్న కానిస్టేబుల్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలం పరిధిలోని కోడూరు గ్రామ సమీపాన ఒక అనాథ వృద్ధుడు మరణించడంతో సమాచారం అందుకున్న ఎర్రగుంట్ల కానిస్టేబుల్ సుబ్బరాయుడు అక్కడికి చేరుకొని అంతియ కార్యక్రమాన్ని నిర్వహించారు. చనిపోయిన వృద్ధునికి ఎవరూలేరని తెలియడంతో తిప్పులూరు గ్రామంలో ఉన్న ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమానికి కానిస్టేబుల్ సమాచారం అందించారు. ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్రతో కలిసి కానిస్టేబుల్ సుబ్బరాయుడు అంత్యక్రియలు నిర్వహించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం వారిని పలువురు అభినందించారు.

అంత్యక్రియల్లో కానిస్టేబుల్,ఆశ్రమ నిర్వాహకులు

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర పేర్కొన్నారు. తుమ్మలపల్లెలోని గంగమ్మ చింతల దగ్గర ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు పాత్ర ప్రముఖమైందన్నారు. ఎండాకాలం ప్రారంభం కావడం తో నాటిన మొక్కల పెంపక సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. గ్రామంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలను తొలగించడం ద్వారానే సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.శేషమహేశ్వరమ్మ, అధ్యాపకులు పి.మనీషా, మాధవరెడ్డి, చంద్రశేఖర్, ఆలయ ధర్మకర్తలు గంగాధర్‌రెడ్డి, సోమశేఖరరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

టిడిపి నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

టిడిపి నాయకుల అరెస్టు అప్రజాస్వామిక చర్య అని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరామ్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్‌బాషా తెలిపారు. పెద్దశెట్టిపల్లిలో గురువారం వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు వాసు, రామగోపాల్‌రెడ్డి అక్రమ అరెస్టులను ఖండించారు. ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కొరిగేమ్ తిమ్మయ్య, రామచంద్ర పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ప్రాంగణంలో గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీజగన్మాత ఈశ్వరిదేవి మఠాధిపతులు వీర శివకుమార్ స్వామి దంపతులు, కీర్తిశేషులు శేషులు మఠాధిపతి కుమారులు వెంకటాద్రి స్వామి, భద్రయ్య, వీరంభట్లయ్య, దత్తాత్రేయ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్యచారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న నిర్వాహకులు